సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025

వైభవంగా హనుమాన్ విజయయాత్ర



హనుమాన్ విజయయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు



మహబూబ్‌నగర్‌లో హనుమాన్ విజయయాత్రలో జనసందోహం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో హనుమన్ జయంతిని పురస్కరించుకొని శనివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ విజయయాత్ర నిర్వహించారు. స్థానిక రామమందిరం నుంచి మేళతాళాలతో స్వామివారి ఊరేగింపుతో విజయయాత్ర క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, న్యూటౌన్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం హనుమంతుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. విశ్వహిందు పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, హిందువాహిని తదితర ధార్మిక సంస్థల నేతలు, కార్యకర్తలు కాషాయ ధ్వజాలను చేతబూని ఈ విజయయాత్రలో ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడి జీవిత చరిత్ర మనకందరికీ ఆదర్శమని అన్నారు. ఆ దివ్య హనుమంతుడి ఆశీస్సులు మనందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విజయయాత్రలో పాల్గొని హనుమంతుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, మనోహర్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సలేశ్వరం లోయలో భక్తజన సందోహం

వనమంతా జనం

- లింగమయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు
- చైత్రశుద్ధ పౌర్ణమి రోజున పెరిగిన రద్దీ
- మండుటెండలను లెక్కచేయకుండా కాలినడకన సలేశ్వరం
- నిబంధనలు సడలించి.. 24 గంటల పాటు అనుమతించిన అటవీశాఖ
- వరుస సెలవులు రావడంతో బారులుదీరిన వాహనాలు, ట్రాఫిక్ జామ్

- అచ్చంపేట/లింగాల

సలేశ్వరం ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గతేడాది అటవీ శాఖ ఆంక్షలతో భక్తులు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సడలింపు ఇవ్వడం, ముఖ్యంగా ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాత్రివేళ కూడా అనుమతించారు. దీంతో నల్లమల రహదారులు కిక్కిరిసిపోయాయి. అభయారణ్యం లింగమయ్య నామస్మరణతో పులకించిపోయింది.



వివరాలు 8లో..



న్యూస్‌రీల్

ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ఉన్న మినీ ట్యాంక్‌బండ్ వద్ద కొనసాగుతున్న సుందరీకరణ పనులను శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే యెన్నం ఇక్కడి కట్టపై ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మొత్తం రూ.రెండు కోట్లు ముడా నుంచి కేటాయించామని వివరించిన విషయం విదితమే. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ నగర ప్రజలు వచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడానికి వివిధ పనులు చేపడుతున్నారు. తాజాగా అక్కడి విభిన్నమైన ఆకృతిలో తీర్చిదిద్దిన పెద్ద డోమ్‌కు జాతీయ భావం పెంపొందించేలా మూడు రంగులతో పెయింటింగ్ వేస్తున్నారు.

పీయూలో ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ (పీయూ)లోని సెమినార్ హాల్‌లో శనివారం ఎంఎస్‌ఎన్ లేబరేటరీ నిర్వాహకులు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. కాగా క్యూసీ, క్యూఏ, ప్రొడక్షన్ పోస్టుల కోసం యూజీ, పీజీ రసాయన శాస్త్రం విద్యార్థులు 60 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.ఎస్‌ఎన్ అర్జున్‌కుమార్ మాట్లాడుతూ మొదటి దశలో రాత పరీక్ష ఉంటుందన్నారు. ఇందులో అర్హత సాధించిన ఉద్యోగార్థుకు తర్వాత ముఖాముఖి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. త్వరలోనే తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఆర్ సుబ్బారావుతో పాటు క్యూసీ మేనేజర్లు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి భారీ బందోబస్తు



మహబూబ్‌నగర్ క్రైం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్‌శాఖ పాలమూరులో భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. దాదాపు 200 మంది బలగాలతో ప్రధాన కూడళ్లు, ర్యాలీ వెంట విధులు నిర్వహించారు. బందోబస్తు విధానాన్ని జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ప్రాంతాన్ని పరిశీలించే విధంగా సీసీ కెమెరాల సహాయంతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ బందోబస్తులో మహిళ సిబ్బంది, ప్రత్యేక విభాగాలు, క్యూఆర్‌టీ బలగాలు, ట్రాఫిక్ పోలీసులు కలిసి సమన్వయంతో పని చేసినట్లు తెలిపారు. ర్యాలీ మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్ చేసి ఇతర వాహనదారులకు ఇబ్బందులు రాకుండా చూసినట్లు తెలిపారు.

ఎండలో విధులు..

తప్పని వెతలు

వడగాలుల నడుమ ట్రాఫిక్ పోలీసుల విధులు



మహబూబ్‌నగర్ సుభాష్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

ఒకవైపు పోటెత్తిన వాహనాలు.. మరోవైపు నిప్పులు కురిసేలా ఎండ.. ఒక్క క్షణం ఆదమరిచినా ముంచుకొచ్చే ప్రమాదాలు. ఎండల్లో ట్రాఫిక్ పోలీసుల విధి నిర్వహణ కత్తిమీద సామే. నిప్పుల కుంపటిపై నిల్చొని పని చేస్తున్నట్లు ఉన్నా.. వేడి గాలులు వీస్తున్నా.. వడదెబ్బలు తగులుతున్నా.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటున్నారు.

- మహబూబ్‌నగర్ క్రైం

- అధిక వేడి వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం
- ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు
- పాలమూరులో క్యాప్‌లు, కూలింగ్ అద్దాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ

ఉదయం 8 గంటల నుంచే ఎండ దంచికొడుతోంది. ప్రస్తుతం దాదాపు 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగకు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి.. కానీ ట్రాఫిక్ పోలీసులకు సెగలు కక్కుతున్న ఎండలో విధులు కొనసాగిస్తున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండలతో రోడ్లపై విధులు నిర్వహించే పోలీసులకు ఇబ్బందులు ఎదురవుతున్నా సమర్థవంతంగా వారి బాధ్యతలు పూర్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏకైక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మహబూబ్‌నగర్‌లో ఉండగా.. ఇక్కడ మొత్తం 55 మంది పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారు. ఇందులో ఒక సీఐతో పాటు ఇద్దరూ ఎస్‌ఐలు, ఒక ఏఎస్‌ఐ, 12 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 32 మంది కానిస్టేబుల్స్, ఏడుగురు హోంగార్డులు ఉన్నారు. మిగతా జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లేనప్పటికీ ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. వనపర్తి జిల్లాలో ఏఆర్ ఎస్‌ఐ, ఏఎస్‌ఐ,12 మంది కానిస్టేబుల్స్, నలుగురు హోంగార్డులు, గద్వాల జిల్లాలో ఒక ఏఆర్ ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది హోంగార్డులు, నాగర్‌కర్నూల్‌లో ఒక ఎస్‌ఐ, ఒక ఏఎస్‌ఐ, నలుగురు హోంగార్డులు, ఆరుగురు కానిస్టేబుల్స్ విధులు నిర్వహిస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో ట్రాఫిక్ విభాగంలో 102 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిని ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను బట్టి రెండు షిఫ్ట్‌లుగా విభజించి విధులు కేటాయిస్తున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహబూబ్‌నగర్‌లోని పిస్తాహౌస్, మెట్టుగడ్డ, న్యూటౌన్, సుభాష్ చంద్రబోస్ సర్కిల్,, బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, అశోక్ టాకీస్, పాత బస్టాండ్, వన్‌టౌన్ చౌరస్తా, తెలంగాణ కూడలి, పాన్‌చౌరస్తా, గాంధీచౌక్ ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఉంటుంది. వనపర్తిలో ఇందిరాపార్క్, రాజీవ్ చౌరస్తా, కొత్త బస్టాండ్, గాంధీ చౌక్, నారాయణపేటలోని సత్యనారాయణ చౌరస్తా, ఓల్డ్ బస్టాండ్, మెయిన్ చౌక్, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్‌గేట్ వద్ద, శ్రీపురం చౌరస్తా, రవీంద్రటాకీస్ చౌరస్తా, గద్వాల్‌లో పాత బస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, పాత కూరగాయల మార్కెట్, గాంధీ చౌక్, సుంకులమ్మ మెట్టు వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి..

రోడ్లపై క్రమం తప్పకుండా నిలబడి విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఈ వేడికి జ్వరాల బారిన పడే అవకాశం ఉంటుంది. ఇటీవల మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి ఆరోగ్య శిబిరం నిర్వహించి పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. మిగతా జిల్లాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పోలీసులు తీసుకోవాల్సినవి కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ తాగడం, నీటి శాతం ఎక్కువగా ఉండి శరీరానికి చల్లదనాన్నిచ్చే పుచ్చకాయ, కీర తినడం మంచిది. వీటివల్ల చెమట రూపంలో కోల్పోయే లవణాలు తిరిగి శరీరానికి లభిస్తుంది. ఎంత ఉష్ణోగ్రతలు పెరిగినా జిల్లాకేంద్రాల్లో, మున్సిపాలిటీల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగానే ఉంటుంది. దీంతో పోలీసులు రోడ్లపై నిలబడాల్సిన పరిస్థితి ఉంది. రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపై ప్రయాణం చేస్తుంటాయి. వాటిని క్రమబద్ధీకరించే క్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఎండలో నిలబడి అసౌకర్యానికి గురవుతూ కూడా విధులు కొనసాగిస్తారు. వారు రెండు నిమిషాల పక్కకు వెళ్తే వాహనదారులు గజిబిజిగా వెళ్తూ ట్రాఫిక్ జాం అవుతుంది. దీంతో ఆయా కూడళ్ల వద్ద పోలీసులు తప్పక ఉండాల్సిన పరిస్థితి. ఎండకారణంగా భోజనం కాకుండా కీర, పండ్లు, అల్పాహారం మాత్రమే తీసుకుంటున్నారు. మరికొందరు గ్లూకోజ్, మజ్జిగతో సరిపెట్టుకుంటున్నారు.

ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి..



రోడ్లపై విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది వీలైనంత ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ కలిపిన నీటిని సైతం తీసుకోవాలి. ఎండలోనే ఎక్కువ సమయం నిలబడి ఉండే వారు నిమ్మరసం, కొబ్బరి నీళ్లు సైతం మేలు చేస్తాయి. చెమటలో నీటితో పాటు లవణాలు ఉంటాయి. వీటిలో సోడియం, క్లోరైడ్ ముఖ్యమైనవి. రోజుకు ఐదు లీటర్ల నీటిని తీసుకోవడంతో పాటు పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు తీసుకుంటే మంచిది.

– డాక్టర్ ఏజీ శంకర్, జనరల్ మెడిసిన్, మహబూబ్‌నగర్

జాగ్రత్తలు పాటిస్తున్నాం



జిల్లా ఎస్పీ సూచన మేరకు ఆరోగ్య జాగ్రత్తలు పాటించడంతో పాటు ఇటీవల ఎస్పీ ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ వాటర్ బాటిల్స్, క్యాప్‌లు, కూలింగ్ గ్లాస్‌లు అందజేశాం. అలాగే ఆరోగ్య పరీక్షలు సైతం చేయించారు. నిత్యం సిబ్బందికి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇస్తున్నాం.

– భగవంతురెడ్డి, ట్రాఫిక్ సీఐ, మహబూబ్‌నగర్

ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి..



పట్టణంలో ఉన్న ట్రాఫిక్ పాయింట్లు మొత్తం తిరుగుతూ తనిఖీలు చేస్తుంటాను. ధర్నాలు, ర్యాలీలు, ఇతర ట్రాఫిక్ సమస్యలు వస్తే ఘటన స్థలానికి వెళ్తుంటాను. ఇటీవల ఉన్నతాధికారులు అద్దాలు, టోపీలు, వాటర్‌బాటిల్స్ ఇవ్వడం వల్ల సిబ్బందికి ఉపయోగకరంగా మారాయి. మా వ్యక్తిగతంగా కూడా ఆరోగ్యపరంగా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మయ్య, ఏఎస్‌ఐ, మహబూబ్‌నగర్

అద్దాలు, టోపీలతో మేలు



దాదాపు ఆరు గంటల పాటు రోడ్లపై విధులు నిర్వహించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధానంగా నీరు అధికంగా తాగుతున్నాం. ఉన్నతాధికారులు ఇచ్చిన టోపీలు, అద్దాలు ఉపయోగపడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో తలనొప్పి వంటి సమస్య వస్తే మజ్జిగ, ఇతర ద్రవ పదార్థాలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల నుంచి కావాల్సిన సహాయం అందుతుంది.

– రాఘవేందర్, ట్రాఫిక్ కానిస్టేబుల్ మహబూబ్‌నగర్

ఎండతో ఇబ్బందికరం..



ట్రాఫిక్ నియంత్రించేందుకు ఎండలో నిలబడటం వల్ల ఎండవేడిమితో ఇబ్బందికరంగా ఉంది. షిఫ్ట్‌ల వారీగా విధులు ఉండటంతో కొంత ఉపశమనంగా ఉంది. ఎండవేడిమి నుంచి రక్షణ పొందేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కూలింగ్ గ్లాసెస్‌తో పాటు టోపీలను అందజేశారు. ఎండలో ట్రాఫిక్ డ్యూటీలో ఉండే సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా ఉండటంకోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు.

– శ్రీనివాస్, ట్రాఫిక్ కానిస్టేబుల్, నాగర్‌కర్నూల్



మహబూబ్‌నగర్ బస్టాండ్ వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుకు

రేపటి వరకు అవకాశం



కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ యువత స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తులను సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న చివరి తేదీగా నిర్ణయించిందని కలెక్టర్ విజయేందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాలకు 21 నుంచి 60 ఏళ్ల వయసు వారు దరఖాస్తు చేసుకోవచ్చని, వ్యవసాయేతర పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు 21 నుంచి 55 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో రూ.1,50,000 వార్షిక ఆదాయం, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు ఆయా యూనిట్లకు సంబంధించి దరఖాస్తుతో పాటు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్, సదరం ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేయాలని సూచించారు.

మన్యంకొండలో వైభవంగా కల్యాణం



అమ్మవారి తాళిబొట్టును చూపుతున్న చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్



అలంకరణలో స్వామి దంపతులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తులు తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ కనులపండువగా సాగింది. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామివారి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబాని



హజ్‌యాత్ర గైడ్‌లను ఆవిష్కరిస్తున్న చైర్మన్లు అఫ్జల్ బియాబాని, ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్రికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబాని అన్నారు. జిల్లాకేంద్రంలోని వైట్ హౌజ్ కన్వెన్షన్‌లో జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హజ్‌యాత్రికులకు మెగా డిజిటల్ ట్రెనింగ్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కమిటీ చైర్మన్ మాట్లాడుతూ మన దగ్గర వాతావరణానికి, అక్కడి వాతావరణానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. అక్కడ ఎండలు మన కంటే ఎక్కువగా ఉన్నాయని, హజ్‌యాత్రికులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హజ్‌యాత్రలో ఎక్కువగా నడవాల్సి వస్తుందని, అందువల్ల యాత్రికులు ఈ సమయంలో ఎక్కువగా నడవడానికి ప్రాక్టీస్ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి హజ్ హౌస్, ఉర్దూఘర్ నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ హజ్‌యాత్రికులు ప్రజల క్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం దువా చేయాలన్నారు. జిల్లా హజ్ సొసైటీ రూపొందించిన హజ్‌యాత్ర గైడ్‌లను చైర్మన్లు ఆవిష్కరించారు. ఢిల్లీకి చెందిన మోనిస్‌ఖాన్ డిజిటల్ ట్రెనింగ్ నిర్వహించగా మౌలానా తస్లీం అన్సారీ, ముఫ్తి ఆసిఫ్, ఖలీల్ అహ్మద్ హజ్‌యాత్రపై శిక్షణ అందజేశారు. ఎస్‌హెచ్‌సీ ఎగ్జిక్యూటివ్ అధికారులు మహ్మద్ సజ్జాద్ అలీ, ఇర్ఫాన్ షరీఫ్, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్ అలీ, ఎండీ మేరాజుద్దీన్, రవూఫ్ పాషా, సత్తార్, సులేమాన్, యూసుఫ్, సుల్తాన్, ఫైజొద్దీన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం రూ.2,201

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,201, కనిష్టంగా రూ.1,800 వరకు నమోదయ్యాయి. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,769, కనిష్టంగా రూ.1,669గా పలుకగా.. ఆముదాల రూ.6,050గా ఒకే ధర లభించింది. సీజన్ కావడం వల్ల మార్కెట్‌కు దాదాపు నాలుగు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కాగా.. మార్కెట్‌కు ఆదివారం సాధారణ సెలవుతో పాటు సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు ఉంటుందని మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. తిరిగి 15వ తేదీ మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పిల్లలకు ఈత నేర్పేందుకు వెళ్లి తండ్రి మృతి

గోపాల్‌పేట: తన పిల్లలకు ఈత నేర్పేందుకు వెళ్లి ఓ తండ్రి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో మధ్యాహ్నం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఏఎస్‌ఐ రాములు తెలిపిన వివరాలు.. బుద్దారం గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీశైలం(41) భార్య ఏర్పుల మంగమ్మతో కలిసి ఇద్దరు కుమారులకు శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బుద్దారం పెద్దచెరువు వద్ద పెద్దతూము, నడింతూము మధ్య ప్రాంతంలో ఈత నేర్పేందుకు వెళ్లారు. మంగమ్మ ఇద్దరు పిల్లలకు నీటిలో మునిగిపోకుండా ఉండేందుకు ప్లాస్టిక్ క్యాన్లు కడుతుండగా శ్రీశైలం ఒక్కసారిగా నీటిలోకి దూకాడు. అనంతరం బయటకు తేలలేదు. ఈ నేపథ్యంలో భార్యాపిల్లలు కేకలు వేయగా స్థానికులు నీటిలోకి దిగి వెతకగా, సుమారు నాలుగు గంటల ప్రాంతంలో మృతదేహం బయటపడింది. బురదలో ఇరుక్కోవడంతో శ్రీశైలం మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మునగాల శివారులో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. గద్వాల పట్టణానికి చెందిన కళ్యాణ్ కుమార్ (27) బైక్‌పై శుక్రవారం రాత్రి తమ బంధువు వివాహం నిమిత్తం వల్లూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని మునుగాల శివారులో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సరోజతో పాటు కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి డీసీఎం దగ్ధం



గట్టు: మండలంలోని లింగాపురం సమీపంలో శనివారం విద్యుత్ వైర్లు తగిలి డీసీఎం దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. లింగాపురం గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న, పెద్దన్న పండించిన పొప్పాయి పండ్లను మార్కెట్‌కు తరలించేందుకు డీసీఎం వచ్చింది. అయితే పొప్పాయి తోట వద్ద డీసీఎంను వెనక్కి తీసుకుంటున్న క్రమంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న రైతులు డీసీఎం డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. డీసీఎంకు అంటుకున్న మంటలు డీజిల్ ట్యాంక్ వరకు వ్యాపించడంతో వాహనం మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం అందుకున్న అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ఘటనతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: రెండు నెలల కరెంట్ బిల్లు కట్టలేదని.. మీటర్ కట్ చేసిన లైన్‌మన్‌ను అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. టూటౌన్ ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి వివరాల మేరకు.. విద్యుత్‌శాఖ అసిస్టెంట్ లైన్‌మన్ శివకిషోర్ స్థానిక న్యూటౌన్‌లో ఉన్న మనోజ్ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు సంబంధించిన రెండు నెలల కరెంట్ బిల్లు కట్టాలని యజమానికి సూచించారు. అయినప్పటికీ బిల్లు కట్టకపోవడంతో ఈ నెల 10న ఆఫీస్‌కు సంబంధించిన విద్యుత్ మీటర్ కనెక్షన్ కట్ చేశారు. దీంతో ఆఫీస్ యజమాని మనోజ్‌కుమార్ 11న మధ్యాహ్నం లైన్‌మన్‌కు ఫోన్‌చేసి అసభ్యకర పదజాలంతో దూషించడంతో పాటు అదే రోజు సాయంత్రం జెడ్పీ కార్యాలయానికి వచ్చి దాడి చేయడానికి ప్రయత్నించాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వనమంతా జనం..



పిల్లలతో సలేశ్వరం లింగమయ్య దర్శనం కోసం..



సలేశ్వరం లోయలో భక్తజన సందోహం



శంఖం పూరిస్తున్న ఓ భక్తుడు



రాళ్లు, రప్పల్లో కర్రల సాయంతో వెళ్తున్న భక్తులు

- లింగమయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు
- చైత్రశుద్ధ పౌర్ణమి రోజున పెరిగిన రద్దీ
- వరుస సెలవులు రావడంతో బారులుదీరిన వాహనాలు, ట్రాఫిక్ జామ్

అచ్చంపేట/ లింగాల: దట్టమైన నల్లమలలోని లోతట్టు ప్రాంతంలో వెలసిన లింగమయ్య దర్శనం చేసుకొనేందుకు భక్తులు బారులుదీరారు. మండుటెండలను లెక్క చేయకుండా.. రాళ్లు రప్పలు.. చెట్లు చేమల్ని దాటుకొని చేతి ఊత కర్రల సాయంతో సాహసయాత్ర చేస్తున్నారు. సలేశ్వరం ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆకాశమంత ఎత్తులో ఉన్న కొండల పైనుంచి జాలువారుతున్న నీటొపరవళ్లలో భక్తులు పరవశించి పోయారు. నల్లమల అటవీ కొండల్లో వెలసిన లింగమయ్య నామస్మరణతో అటవీప్రాంతం పులకించిపోయింది.

గతేడాదితో పోల్చితే ఈసారి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. గతేడాది అటవీ శాఖ ఆంక్షలతో భక్తులు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు సడలింపు ఇవ్వడం, ముఖ్యంగా ఎండలను దృష్టిలో పెట్టుకొని రాత్రివేళ కూడా అనుమతించడం కొంత ఉపశమనం కలిగించింది. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం, సోమవారం అంబేడ్కర్ జయంతి సెలవు దినాలు రావడంతో వాహనాలన్నీ సలేశ్వరం, శ్రీశైలం వైపే వస్తున్నాయి. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి కుంచోనిపల్లి మూల బ్రాహ్మణపల్లి వరకు 3 కి.మీ., వరకు, మరోవైపు ఫర్హాబాద్ నుంచి పుల్లాయిపల్లి పెంట వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వాహనాలను పోలీసులు క్రమపద్ధతిలో పంపించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మరో మార్గమైన లింగాల మండలం అప్పాయిపల్లి– గిరిజన గుండాల దారి సైతం రద్దీగా మారింది.

అటవీ అధికారుల ఇష్టారాజ్యం

సలేశ్వరం ఉత్సవాలకు వెళ్లే వాహనదారుల నుంచి ముక్కుపిండి టోల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఫర్హాబాద్, అప్పాయిపల్లి మార్గంలో టోల్ వసూలకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. బస్సులు/ పెద్ద వాహనాలకు రూ.వెయ్యి, కారు/ జీపులకు రూ.500, ఆటోలకు రూ.300, బైక్‌లకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. గతేడాది నుంచి ఇవే చార్జీలు ఉన్నాయి. అయితే వసూలు చేసిన డబ్బులు దేనికి ఖర్చు చేస్తున్నారో కూడా లెక్కలు లేవని, అటవీశాఖ తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్సవాల గురించి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అటవీ శాఖ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

సలేశ్వరం జాతరకు వెళ్లే వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరిస్తూ ఎలాంటి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపడుతున్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసుల పర్యవేక్షణ కొనసాగుతుంది. పోలీస్, అటవీ శాఖ, వలంటీర్లు పనిచేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కిలోమీటరు దూరానికి ఒక దగ్గర దారి మళ్లించేలా ఏర్పాట్లు చేశారు. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి సలేశ్వరం వరకు అటవీ మార్గంలో పోలీస్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

భక్తుల జేబులకు చిల్లు

సలేశ్వరం క్షేత్రానికి వస్తున్న భక్తుల జేబులు చిల్లు పెడుతున్నారు. ఆర్టీసీ, ఆటో/ జీపుల చార్జీలు మొదలుకొని పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెంచి అమ్ముతున్నారు. అచ్చంపేట నుంచి పుల్లాయిపల్లి వరకు మాత్రమే ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. దీనికి ఆర్టీసీ బస్సు చార్జీ రూ.160 వసూలు చేస్తుండగా.. పుల్లాయిపల్లి నుంచి మోకాళ్ల కుర్వు వరకు ఆటో/ జీపులకు మరో రూ.80 చెల్లిస్తున్నారు. అలాగే ఒక టెంకాయ రూ.100, లీటరు వాటర్ బాటిల్ రూ.50కి విక్రయిస్తున్నారు. లడ్డు ధర రూ.100 నిర్ణయించడంతో భక్తులు ఇవేమి ధరలంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి శిబిరాలు భక్తులను ఆదుకొంటున్నాయి. ధరలు నియంత్రించడంలో అధికారులు ఎవరూ చొరవ చూపడం లేదు.



జలపాతం వద్ద ఇలా..



సలేశ్వరం కొండల్లో భక్తజనం..



లోయలో బారులుదీరిన భక్తులు

ఎస్‌ఎల్‌బీసీ @ 50 రోజులు

- టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- నేటికీ లభించని ఆరుగురి కార్మికుల ఆచూకీ



సొరంగం లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగం పైకప్పు కూలిన ఘటనలో గల్లంతైన కార్మికులను గుర్తించేందుకు చేపడుతున్న సహాయక చర్యలు 50 రోజులకు చేరాయి. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా తవ్వకాలు చేపడుతున్న క్రమంలో ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా.. మార్చి 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్, 25న ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్ మృతదేహాలను గుర్తించారు. శిథిలాల కింద చిక్కుకున్న మరో ఆరుగురి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా రెస్క్యూ సిబ్బంది వాటిని అధిగమిస్తూ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మిగిలిన వారి ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉంది.

రోబోల సేవలు ఎక్కడ?

సొరంగం లోపల అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేందుకు గత నెల 11న తీసుకొచ్చిన రోబోల సేవలు అందుబాటులోకి రాలేదు. మానవులు చేయలేని పనులను రోబోలు చేస్తాయని, వీటిని ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రూ.4 కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన రోబోలు నెలరోజులు దాటినా ఇంత వరకు కనీసం సొరంగం లోపలికి కూడా వెళ్లలేకపోయాయి. రోబో యంత్రాలు సొరంగం ఇన్‌లెట్ వద్ద వృథాగా పడి ఉన్నాయి. ఐదురోజుల పాటు ప్రయత్నించిన అటానమస్ పవర్డ్ హైడ్రాలిక్ రోబోల అనుసంధానంగా వ్యాక్యూమ్ పంపు, వ్యాక్యూమ్ ట్యాంకు సాంకేతిక సమస్యల కారణంగా వాటి పనితీరు నిలిచింది. మట్టి, రాళ్లు, బురద తొలగించేందుకు తీసుకొచ్చిన రోబో యంత్రం పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. టీబీఎం స్టీల్ భాగాలు అడ్డుగా ఉండటంతోనే వీటి సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు తెలుస్తోంది. వాటిని పూర్తిగా తొలగిస్తే తప్ప అత్యంత ప్రమాద ప్రదేశానికి రోబోలు వెళ్లలేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైడ్రాలిక్ వ్యవస్థతో పనిచేసే రోబో ముందు భాగంలో ఉన్న గ్రైండర్ పెద్ద పెద్ద రాళ్లు, శిథిలాలను ముక్కలు చేయడంతోపాటు బురద, మట్టిని వ్యాక్యూమ్ పంపు సాయంతో నేరుగా కన్వేయర్ బెల్టుపై వేస్తోంది. ప్రస్తుతం ఐదు ఎస్కవేటర్లు (హిటాచీలు) సహాయంతో రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నారు.

నిషేధిత ప్రదేశంలో..

సొరంగం పైకప్పు కూలిన 13.936 కిలోమీటరు డీ–1 వద్ద సుమారు 40 మీటర్ల వరకు సహాయక సిబ్బంది వెళ్లలేని ప్రదేశాన్ని నిషేధిత(డేంజర్ జోన్) ప్రాంతంగా గుర్తించారు. నిషేధిత ప్రదేశం దాటి ముందుకు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశం వరకు మట్టి తవ్వకాలు పూర్తయితే మిగిలిన 40 మీటర్ల ప్రాంతం పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. సొరంగం ప్రమాద ధాటికి 125 మీటర్ల పొడవు 1,500 టన్నుల బరువు కలిగిన టన్నెల్ బోరింగ్ మిషన్ సుమారు 50 మీటర్ల వెనక్కి వచ్చింది. సొరంగం తవ్వకాలకు అడ్డంగా ఉన్న టీబీఎం స్టీల్ భాగాలను దక్షిణమధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా కట్టర్‌తో కట్ చేసి లోకో ట్రెన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలు, బురద, టీబీఎం భాగాల తొలగింపు, డీవాటరింగ్ ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతోంది. నిషేధిత ప్రదేశం వరకు యుద్ధ ప్రాతిపదికన మట్టి, బురద తొలగింపు పనులు త్వరితగతిన ముగించాలని సహాయక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. నిపుణుల సలహాల మేరకు ప్రమాద ప్రదేశం వద్ద చేపట్టే పనులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

- కార్మికుల ఆచూకీ కోసం సహాయక సిబ్బంది నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శనివారం సొరంగం ఇన్‌లెట్ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తవ్వకాలకు ఆటంకంగా ఉన్న సమస్యలను అధిగమిస్తూ వేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మట్టి తవ్వకాలు జరుపుతూ కన్వేయర్ బెల్టు ద్వారా, టీబీఎం భాగాలను లోకో ట్రెన్ ద్వారా సొరంగం బయటకు చేరవేస్తున్నామన్నారు. నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను అత్యధిక సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా పంపింగ్ చేస్తూ బయటకు తోడేస్తున్నామన్నారు.

ఇన్విటేషన్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీవెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన ఆటగాళ్లను పరిచయం చేసుకొని మాట్లాడారు.ఈ వయసులో కూడా సీనియర్ క్రీడాకారులు ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న సీనియర్ క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు టీఎస్.రంగారావు, రమేశ్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, గజానంద్‌కుమార్, నందకిషోర్, వడెన్న, నగేశ్‌తోపాటు విశాఖపట్నం కోచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- ఈ టోర్నీలో విశాఖపట్నం, నెల్లూర్, ఏపీ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల జట్టు, మహబూబ్‌నగర్ జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు మ్యాచుల్లో విశాఖపట్నం 4–2 గోల్స్ తేడాతో ఆతిథ్య మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. నెల్లూరు జట్టు 1–0 గోల్స్ తేడాతో ఏపీ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థులపై గెలుపొందింది. విశాఖపట్నం 1–0 గోల్స్ తేడాతో ఏపీ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థులపై, నెల్లూరు జట్టు 4–1 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్‌పై విజయం సాధించాయి. ఆదివారం కూడా ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ కొనసాగనుంది. టోర్నీలో ఆరు మ్యాచ్‌ల్లో ఎక్కువ పాయింట్లు సాధించిన జట్లు విన్నర్, రన్నరప్‌గా నిలుస్తాయి.

‘మాస్టర్’పై శిక్షణకు 2 కళాశాలల ఎంపిక



ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఆయా ప్రిన్సిపాళ్లతో సమావేశమైన వైఐఎస్‌యూ వీసీ సుబ్బారావు

- మహబూబ్‌నగర్, కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పైలట్ ప్రాజెక్టు అమలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- తాజాగా జిల్లాలోని ప్రిన్సిపాళ్లతో సమావేశమైన వైఐఎస్‌యూ వీసీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ‘మాస్టర్’పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ప్రభుత్వ డిగ్రీ–పీజీ కళాశాలలు ఎంపికయ్యాయి. వీటిలో మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ–పీజీ కళాశాల, కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా 2025–26 విద్యా సంవత్సరం నుంచి ‘మాస్టర్’ (మహబూబ్‌నగర్ స్కిల్ ట్రెయినింగ్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ రెడినెస్) ను పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయనున్నారు. ప్రతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదివిన విద్యార్థులకు వృత్తిపరమైన, దైనందిన జీవితంలో అవసరమయ్యే అన్ని నైపుణ్యాలను నేర్పిస్తారు. ముఖ్యంగా విద్యార్థులను భవిష్యతులో అన్ని రంగాలలో రాణించేలా తీర్చిదిద్దనున్నారు.

అవగాహన కల్పించేందుకు ట్రైనర్లు

ఇందులో భాగంగా తాజాగా శనివారం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) వైస్ చాన్స్‌లర్ వీఎస్‌వీఎస్‌ఎస్ సుబ్బారావు అధ్యక్షతన శనివారం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో స్థానిక ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ–పీజీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘మాస్టర్’పై డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గాను నిష్ణాతులైన ట్రైనర్లను పంపిస్తామన్నారు. విద్యార్థులకు ఖచ్చితంగా హాజరు శాతాన్ని, అవగాహన సామర్థ్యాలను బేరీజు వేస్తూ వారిని రెండు తరగతులుగా విభజిస్తామన్నారు. మొదటిది ‘బేసిక్’లోగల విద్యార్థులకు కిందిస్థాయి నుంచి సాఫ్ట్ స్కిల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్ వృద్ధి చేస్తారన్నారు. రెండో కేటగిరీ కింద ‘బేసిక్ ప్లస్’లో విద్యార్థులకు కోర్ సబ్జెక్టులలో లోతుగా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఐఎస్‌యూ రిజిస్ట్రార్ చమన్ మెహతా, విషయ నిపుణురాలు సౌమ్య నటరాజన్, ప్రొఫెసర్ జె.సుధాకర్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల (మహబూబ్‌నగర్), గద్వాల, కొడంగల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.కె.పద్మావతి, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, డా.జి.సుకన్య, డా.బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి చేసిన యువకులకు రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై చిరువ్యాపారం చేసుకునే ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడిచేసి స్మార్ట్‌ఫోన్ లాక్కుని వెళ్లారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీకి చెందిన మనోజ్‌కుమార్ స్థానిక అశోక్ టాకీస్ చౌరస్తాలో సోడాబండి పెట్టుకొని ఉండగా.. సంతోష్‌కుమార్, సాయిరాం, కృష్ణ అనే ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చి మనోజ్‌కుమార్‌పై దాడి చేశారు. ఆ తర్వాత అతడి సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని, మరో యువకుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. యువకులు ఉపయోగించిన బైక్, సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న అన్నిరకాల దుకాణాల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

నకిలీ వైద్యులు, ఆస్పత్రులపై ఉక్కుపాదం

దేవరకద్ర రూరల్: పట్టణంలో నకిలీ వైద్యులు, ఆస్పత్రులపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర బృందం సిద్ధమైంది. గత రెండు రోజుల నుంచి దేవరకద్రలోని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఆర్‌ఎంపీలకు సంబంధించిన పూర్తి వివరాలను నిఘావర్గాలు సేకరించినట్లు సమాచారం. ఈ నెల 7న రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధ్వర్యంలో అర్హతకు మించి ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీకి సంబంధించిన ఆస్పత్రిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే పలువురు ఆర్‌ఎంపీలు, నకిలీ వైద్యులపై పత్రికల్లో కథనాలు రావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. దీంతో పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వ, మెడికల్‌కు సంబంధించిన నిఘావర్గాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. అర్హత లేకుండా, మంత్రాల పేరిట చికిత్స అందిస్తున్న వారు, డాక్టర్ల కింద కొంతకాలం పనిచేసి ప్రత్యేకంగా క్లినిక్‌లు నడుపుతున్న వారు ఎంతమంది అనే విషయాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కొందరు వైద్యులు, ఆర్‌ఎంపీలు ఒక సీనియర్ వైద్యుడి సమక్షంలో రహస్యంగా సమావేశమయ్యారని, సమస్యలు ఎన్ని వచ్చినా అందరం కలిసి కట్టుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.